## క్లుప్తంగా

### సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి



నున్న(విజయవాడరూరల్): సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రిటైర్డ్ ఆఫీసర్ డాక్టర్ జాకబ్ విక్టర్ గంట అన్నారు. శనివారం నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ కాలంలో సైబర్ సెక్యూరిటీ అనేది చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. సరైన సైబర్ సెక్యూరిటీ లేకపోతే డేటా సెంటర్స్, పవర్ లాంటి నెట్వర్క్ గాని టెలికం నెట్వర్క్‌ని నిర్వీర్యం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ అన్ని విభాగాలకు సంబంధించిన ఒక సేఫ్ గార్డుగా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరూ తప్పకుండా సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్. శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషోర్‌బాబు, విభాగాధిపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మృతికి నివాళి



చింతా వెంకటేశ్వరరావు (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, శ్రీకృష్ణా థియేటర్ అధినేత చింతా వెంకటేశ్వరరావుకు శనివారం ఘనంగా అంతిమ వీడ్కోలు పలికారు. కొద్దిరోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆయన శుక్రవారం కన్నుమూశారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ఏర్పాటుకు విశేష కృషి చేయటంతో పాటుగా భవన నిర్మాణానికి విరాళం ఇచ్చారు. ఆయన మృతికి సంతాపంగా పాఠశాలకు శనివారం సెలవు ప్రకటించారు. పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉన్నకాలంలో గోడౌన్ నిర్మాణానికి భూవిరాళం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. శ్రీకృష్ణా గ్రూపు పేరిట పలు వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించారు. ఆయన మృతదేహానికి మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యాపార ప్రముఖులు, రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చింతా వెంకటేశ్వరరావు అంతిమయాత్రలో వందలాది మంది స్థానికులు పాల్గొని ఆయనకు జోహర్లు అర్పించారు.

### 250 మందికి బస్ పాస్‌ల పంపిణీ



గన్నవరం రూరల్: స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు అండగా నిలవటం అభినందనీయమని సూరంపల్లి ఇన్‌చార్జి సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో వంద మంది విద్యార్థులకు గన్నవరం కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు కేవీఆర్ కిషోర్ విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లను ప్రముఖ న్యాయవాది కేవీ రమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి తమవంతు సహాయం అందజేస్తున్న కిషోర్‌ను కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, హెచ్ఎం హరిశరణ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

**గొల్లనపల్లిలో..**

గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లకు అవకాశం

నున్న(విజయవాడరూరల్): మామిడితోటలు, అరటి, జామ, ఆయిల్‌పామ్, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కూరగాయలు పండించే చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు అందజేస్తామని ఏపీఎంఐపీ(ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు) జిల్లా అధికారి పీఎం.సుభాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన వారికి ఈ సౌకర్యం ఉందన్నారు. అలాగే ఐదు ఎకరాల పైబడి వ్యవసాయం చేస్తున్న రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ పొందవచ్చన్నారు. ఆసక్తిగల రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు ఆధార్‌కార్డ్, భూమికి సంబంధించిన 1బీ, బ్యాంక్ పాస్ పుస్తకంతో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

---

### రాత్రివేళల్లో భద్రత పెంచాలి



మహిళలు పని చేసే ప్రదేశాల్లో భద్రత సక్రమంగా ఉండటం లేదు. అందువల్లే మహిళా ఉద్యోగులు, సిబ్బందిపై దాడులు, అకృత్యాలు జరుగుతున్నాయి. రోగులు, వారి బంధువులు చాలా దురుసుగా వ్యవహరిస్తున్నారు. మహిళలుగా వారిని నియంత్రించటం సాధ్యం కావటం లేదు. ప్రత్యేకించి రాత్రి వేళల్లో సమస్య అధికంగా ఉంటుంది. చాలా చోట్ల ఈ సమస్య ఉంటున్నట్లు మీడియాలో చూస్తున్నాం. రాత్రివేళల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి. వైద్యులు, సిబ్బంది సంక్షేమం దిశగా అడుగులు వేయాలి. ఏదైనా ఘోరం జరిగితే వెంటనే శిక్షలు పడితే దారుణాలు కొంత వరకూ తగ్గుతాయి.

– డాక్టర్ ఎల్.దుర్గాదేవి, మత్తు వైద్యురాలు, కంకిపాడు



### మహిళలకు భద్రత కల్పించాలి



మహిళలకు ప్రభుత్వం భద్రత కల్పించాలి. ప్రధానంగా మహిళలు పని చేస్తున్న ప్రదేశాలలో వారి సంక్షేమం దృష్ట్యా పటిష్టమైన భద్రత అవసరం. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన చాలా దారుణం. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించిన తీరు సరిగా లేదు. దేశఅత్యున్నత న్యాయ స్థానంలోనే బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నా. దేశంలో మరెక్కడా ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– పుసులూరి పాతాళలక్ష్మి, ఐద్వా కార్యదర్శి, పెనమలూరు

---

# ఆ నాయకుడికే 'ఫుడ్' కోర్టు

- చిరువ్యాపారులను తరిమేసిన మునిసిపల్ అధికారులు
- వాటిస్థానంలో ఫుడ్ కోర్టు ఏర్పాటు
- ఫుడ్ కోర్టు స్టాల్స్‌లో టీడీపీ చోటా నాయకుడి దందా



తాడిగడప సెంటర్‌లో ఫుడ్‌కోర్టు కోసం చేస్తున్న ఏర్పాట్లు

పెనమలూరు: టీడీపీ నేతల అక్రమార్జన కోసం చిరు వ్యాపారుల పొట్టకొట్టి ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేస్తున్నారు. తాడిగడప జంక్షన్‌లో శనివారం టీడీపీ నేతలు హడావుడి చేసి ఫుడ్‌కోర్టు పేరుతో కాసుల కోసం తెరలేపారు. తాడిగడప జంక్షన్‌లో వంతెనకు ఆనుకొని చాలా కాలంగా చిరు వ్యాపారులు బండ్లు పెట్టుకొని పలు రకాల వ్యాపారాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే గత కొద్ది రోజుల క్రితం మున్సిపాపల్ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, కనీస సమయం కూడా ఇవ్వకుండా చిరు వ్యాపారుల దుకాణాలు బలవంతంగా తొలగించారు. చిరు వ్యాపారులు లబోదిబోమన్నా మున్సిపల్ అధికారులు కనికరించలేదు. దీని పై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించటానికి మున్సిపాలిటీ ఈ చర్యలు తీసుకుందని అందరు భావించారు.

**తెరపైకి ఫుడ్‌కోర్టు..**

కాగా చిరు వ్యాపారుల పొట్ట ఎందుకు కొట్టారో ఇప్పుడు అసలు రంగు బయటపడింది. చిరు వ్యాపారాలను తొలగించిన ప్రాంతంలో ఆగమేఘాలపై ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీకి నామమాత్రం అద్దె చెల్లించి ఫుడ్‌కోర్టులో దాదాపు డజను స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ చోటా నాయకుడు ఈ ఫుడ్‌కోర్టు పేరుతో దందాకు తెరలేపాడని ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుతున్నారు. ఫుడ్‌కోర్టులో స్టాల్స్ వ్యాపారుల వద్ద దండుకునే పనిలో చోటా నేత ఉన్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ నేతలు అవకాశం చిక్కితే కాసుల కోసం ఏ వ్యాపారం చేయటానికైనా చేతులు చాస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.



ఫుడ్ కోర్టు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

**అనుమతి ఇచ్చాం..**

ఫుడ్‌కోర్టు ఏర్పాటుకు మున్సిపాలిటీ అనుమతి ఇచ్చింది. ఒక్కో స్టాల్‌కు నెలకు రూ.వెయ్యి వంతున వసూలు చేస్తాం. రాత్రి సమయంలోనే వ్యాపారం ఉంటుంది.

– ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ

---

# ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టండి

ఏసీపీ దామోదర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ, సీఐ, ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు: విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని సెంట్రల్ ఏసీపీ కె. దామోదర్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నివారణ' అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ తోటి విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాగింగ్ నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పటమట సీఐ పవన్ కిశోర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాలా మంది యువత మత్తు పదార్థాల బారిన పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సరదాగా మొదలైన అలవాటు కాస్తా బానిసలుగా మారుస్తుందన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, పేపర్ ప్రెజెంటేషన్ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, అధ్యాపకులు, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీతాలు ఇప్పించండి సారూ !

ఆయాలు, వాచ్‌మెన్ల అసోసియేషన్ వినతి



రూరల్ ఎంఈఓకి వేతనాలు చెల్లించాలని వినతి పత్రం అందజేస్తున్న ఆయాలు (ఫైల్)

విజయవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న వారికి గత నాలుగు నెలలుగా జీతాల్లేక అనేక అవస్థలు పడుతున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్స్, మండల ప్రాథమికోన్నత పాఠశాలలు, మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు నెలకు రూ.6 వేల వంతున జీతాలు చెల్లించాల్సి ఉంది. తరగతి గదులను శుభ్రం చేయడం, టాయలెట్లను క్లీన్‌గా ఉంచాల్సిన బాధ్యత వీరిది. అయితే గత నాలుగు నెలలుగా తమకు జీతాలు చెల్లించకపోవడంతో ఇంట్లో గడవటం కష్టంగా ఉందని ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా ఇటీవల నున్న గ్రామంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో ఎ.వెంకటరత్నంను కలిసి వినతి పత్రం అందజేశారు.

**మండలంలో 60 మంది..**

మండలంలో 53 మంది ఆయాలు పని చేస్తుండగా, ఏడుగురు వాచ్‌మెన్ లు హైస్కూల్స్‌లో పని చేస్తున్నారు. మొత్తం 60 మంది పనిచేస్తున్నా వీరికి జీతాలు సకాలంలో అందడంలేదంటున్నారు. పలు దఫాలు జీతాలు చెల్లించాలని వినతి పత్రాలు అందజేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయాలకు, వాచ్‌మెన్‌లకు జీతాలు చెల్లించాలని ఆయాలు, వాచ్‌మెన్ల అసోసియేషన్ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వరావు విజ్ఞప్తి చేస్తున్నారు.

---

# ఈ–పంట నమోదు పరిశీలన



ఈడుపుగల్లులో ఈ-పంట నమోదును తనిఖీ చేస్తున్న డీడీఏ జగ్గారావు



ఉంగుటూరులో ఈ- క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏవో హరీష్ కుమార్

కంకిపాడు: ఈ-పంట నమోదు సమర్థంగా నిర్వహించాలని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ డీడీఏ ఎం.జగ్గారావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ-పంట నమోదు ప్రక్రియను శనివారం ఆయన తనిఖీ చేశారు. పంట నమోదులో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. డీడీఏ జగ్గారావు మాట్లాడుతూ గతంలో కౌలురైతులకు ఇష్టానుసారంగా ఈ-క్రాప్ నమోదు చేయటంతో వాస్తవిక జాబితా రూపకల్పన జరగలేదన్నారు. వాస్తవ సాగుదారులు, కౌలురైతులతోనే ఈ-పంట నమోదు జరగాలన్నారు. నిబంధనలు పాటించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. ఈ-పంట నమోదు వేగంగా పూర్తి చేయాలని, లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పర్యటనలో మండల వ్యవసాయాధికారి పీఎం.కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో హరీష్ కుమార్ సూచించారు. ఉంగుటూరులో ఈ క్రాప్ నమోదును వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన కలిగిన పంట నష్ట పరిహారం అందాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలన్న పంట నమోదు చేయించుకోవలని చెప్పారు. ప్రస్తుతం మండలంలో 50 శాతం పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా మేడిపాడు గ్రామానికి చెందిన శేషశ్రీ గంగూరు వద్ద ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు కడుపు నొప్పి రావటంతో టీచర్ కిరణ్మయితో కలిసి కంకిపాడులో డాక్టర్ వద్దకు వైద్యం కోసం వెళ్లింది. శేషశ్రీ, టీచర్ కిరణ్మయి తిరిగి కాలేజీకి ఆటోలో వచ్చి గంగూరు పెట్రోల్ బంక్ వద్ద దిగారు. వీరు బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు నుంచి విజయవాడ వైపునకు వస్తున్న బైక్ శేషశ్రీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు అవటంతో పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఈ ప్రకారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

---

# కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారుల సందడి



కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

ఉయ్యూరు: కృష్ణాష్టమి వేడుకలు ఉయ్యూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంకె.గ్రూప్స్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ఉట్టికొడుతూ కేరింతలు కొట్టారు. వేడుకల సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బుర పరిచాయి. డ్యాన్స్ అకాడమీ చైర్మన్ ఎంకే బాబు పర్యవేక్షించారు.

కంకిపాడు: కృష్ణాష్టమి వేడుకలు ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో శనివారం వైభవంగా జరిగాయి. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు, అల్లర్లు అలరించాయి. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆద్యంతం వేడుకలు సాగాయి. కృష్ణాష్టమి వేడుకలను ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఉట్టికొట్టే సన్నివేశంలో గోపికలు, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు పోటీపడటం అందరినీ ఆకర్షించింది. బృందావనం తలపించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్ది ఘనంగా వేడుకలు నిర్వహించారు.

---

# సంపద సృష్టికి దూరంగా కేంద్రాలు

- పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో జఠిలమవుతున్న చెత్త సమస్య



గన్నవరంలో నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రం

గన్నవరం: గ్రామాల్లో వ్యర్థాల నుంచి గ్రామ పంచాయతీలకు సంపద సృష్టించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఈ కేంద్రాల నిర్వాహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా లక్షలాది రూపాయిలతో నిర్మించిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు వినియోగంలోకి రావడం లేదు. నియోజకవర్గంలోని 84 గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 2016 నుంచి ఈ కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల నిర్వాహణ, వర్మికం పోస్ట్ ఎరువుల తయారీ విధానంపై పలుమార్లు అధికారులు, సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ కూడా ఇచ్చారు. ఈ కేంద్రాల్లో అవసరమైన యంత్ర పరికరాలను కూడా మేజర్ గ్రామ పంచాయతీలకు సరఫరా చేశారు. అయినప్పటికీ ఈ కేంద్రాల వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడం లేదు. కేవలం పది శాతం గ్రామ పంచాయతీల్లో మాత్రమే అరకొరగా వర్మికం పోస్ట్ ఎరువులను తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు.

**ఎక్కడి చెత్త అక్కడే..**

నియోజకవర్గంలో అన్ని గ్రామ పంచాయతీలకు డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్త సమస్య నానాటికి జఠిలమవుతోంది. రోజూ గ్రామ పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్న టన్నుల కొద్దీ చెత్తను గ్రామ శివారుల్లో డంప్ చేస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి చెత్త సంపద సృష్టి కేంద్రాలు కొంత వరకు దోహదపడతాయి. అయినప్పటికి ఈ కేంద్రాలను వినియోగించేందుకు అధికారులు, పాలక వర్గాలు ముందుకురావడం లేదు. గన్నవరంలో ఈ కేంద్రం నిర్మించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ కేంద్రం నిర్మాణానికి, మరమ్మతులకు ఇప్పటివరకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినప్పటికీ పైసా సంపద సృష్టించలేకపోయారు. ప్రతిరోజూ గ్రామంలో సేకరిస్తున్న ఐదు టన్ను చెత్తను స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా డంప్ చేస్తున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. మిగిలిన మేజర్ గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే సమస్య నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. దీనివల్ల కొంత వరకైనా చెత్త సమస్య తీరుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# రోటరీ సేవలు విస్తృతం చేయాలి



రోటరీక్లబ్ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, రొటేరియన్లు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మచిలీపట్నం రోటరీక్లబ్ 2024–25 నూతన కార్యవర్గప్రమాణ స్వీకారం శనివారం స్థానిక రోటరీ హాల్లో జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీక్లబ్ ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ ఎల్. మోజెస్,ప్రధానకార్యదర్శిగాఅనుపమ ముఖర్జీ, తదితరులతో ప్రమాణస్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ చరిత్రను తెలిపే పుస్తకాన్ని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ అసిలేటి జ్యోతి, క్లబ్ సభ్యులు అజ్మతున్నీసా, సాయిప్రసాద్, పీవీ ఫణికుమార్, కె.సతీష్ బాబు, సంజయ్, రఘు పాల్గొన్నారు.

---



## • రోడ్డే 'రెస్టా'రెంట్

వ్యవసాయ రంగంలో మహిళా కార్మికుల పాత్ర కీలకమైనది. పని ప్రాంతంలోనే సంతోషాలను వెతుక్కుంటూ కష్టాలను మరిచిపోయి కుటుంబ పోషణవైపు అడుగులు వేస్తుంటారు. వరి పంటలో కలుపు తీసేందుకు మండలంలోని సావరగూడెం వచ్చిన వ్యవసాయ కూలీలు వీరు. తెంపల్లి గ్రామానికి చెందిన 18 మంది కూలీలు శనివారం తెల్లవారకముందే బయలుదేరి, అన్నం బాక్సులు సిద్ధం చేసుకుని, కనీసం 10కిలో మీటర్లు ఆటోలో ప్రయాణం చేసి, ఉదయం 7గంటలకు సావరగూడెం చేరుకున్నారు. కలుపు తీసే పంట భూముల వద్ద రహదారిపై కూర్చుని వెంట తెచ్చుకున్న భోజనం చేస్తూ ఛలోక్తులతో సరదాగా కొద్దిసేపు కష్టాలను మరిచిపోయారు. మళ్లీ పని చేసేందుకు సమాయత్తం అయ్యారు.

– గన్నవరం రూరల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com